క్లుప్తంగా

బొండా జైలుకెళ్ళడం ఖాయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):సింగ్‌నగర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేయించిన మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జైలుకు వెళ్లటం ఖాయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ బాషి అన్నారు. దాడి చేసిన వ్యక్తులు ఉమా అనుచరులు అని స్పష్టమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పైనే దాడి చేయించిన బొండా ఉమా అక్కడ గెలిస్తే ప్రజల్ని బతకనివ్వడన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు బూదాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సుభాని ఖాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుల్లా మేరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జరిగేది రామరావణ యుద్ధం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో రానున్న ఎన్నికలు రామరావణ యుద్ధం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన వీడియోను మీడియాకు బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో రామాయణమే నడుస్తుందన్నారు. రామరాజ్య పాలన అంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలించే ప్రజా పాలన అందరికీ గుర్తుకు వస్తుందన్నారు. పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో ప్రజలు గెలవాలంటే కచ్చితంగా జగన్‌ను గెలిపించి తీరాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. రామరాజ్యం లాంటి జన రంజక పాలన రావాలన్నా, పెత్తందారులు ఓడాలన్న కచ్చితంగా పేదల పక్షాన నిలబడిన జగన్‌మోహన్‌రెడ్డిని అందరం గెలిపించుకోవాలన్నారు.

వైభవంగా సాయినాథుని చందన ఊరేగింపు



భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మహిళా భక్తులు సాయిబాబా మందిరంలో బాబాను కీర్తిస్తూ గీతాలాపన చేస్తూ కోలాట ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం ఏర్పాటు చేసిన సాయిబాబా చందనోత్సవ ఊరేగింపు కాలనీలోని పురవీధుల్లో అశేష భక్త జనం మధ్య జరిగింది. కార్యక్రమాన్ని మందిరం పాలక మండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరు రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీ లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, జీ కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు నిర్వహించారు.

లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రోడ్ పక్కన, సితార సెంటర్ సమీపంలోని విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం సాయంత్రం నిర్వాహకులు గరిమెళ్ల విద్యాశ్రీ, నానయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపూర్ పింక్ ప్యాలెస్ నమూనా ముఖద్వారంతో ఎంతో ఆకర్షణీయంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. వేసవి కాలంలో పిల్లలు, పెద్దలకు సాయంత్రం సమయంలో అహ్లాదకరమైన వాతావరణంలో ఆటవిడుపుగా ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఉండే ఈ ఎగ్జిబిషన్‌లో జైంట్ వీల్, మేరి కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, ఇండియన్ టోరా టోరా, ఇటాలియన్ ఐటమ్స్ వంటి ప్రత్యేకమైన ఆట వస్తువులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే బెడ్ షీట్స్, బెంగాలీ కాటన్ శారీస్, లక్నో శారీస్, నైటీస్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌తోపాటు అనేక రకాల ఫుడ్ స్టాల్స్‌కూడా ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు సప్పా శివకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. డాక్టర్ జయంతి చక్రవర్తి, డాక్టర్ దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సుశీల్ కుమార్, వెంకటేశ్వరరావు, భారతి, సౌజన్య, రూపశ్రీ భక్తి గీతాలతో పాటు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు జయంతి చక్రవర్తి సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ దామోదర గణపతిరావు మాట్లాడుతూ.. సంస్థ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నామన్నారు.

జగదానందకారకం.. శ్రీరాముని కల్యాణం

- అంబరాన్ని తాకిన శ్రీరామనవమి వేడుకలు
- ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన రామాలయాలు



నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో నవమి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):లోకాభిరాముడు, జగదభిరాముడు, ఆదర్శ పురుషుడైన శ్రీరామచంద్రుని కల్యాణం బుధవారం జగదానందకారకంగా సాగింది. సమస్త మానవాళి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఏటా నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా వన్‌టౌన్‌లోని వాడవాడలా శ్రీరాముడు, సీతమ్మవారి కల్యాణోత్సవాలు నయనానందకరంగా సాగాయి. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, పండితుల వ్యాఖ్యానాలు, భక్తుల శ్రీరామ నామ నినాదాల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని ఆయా రామాలయాలు, వైష్ణవాలయాల్లో వైఖానసాగమోక్తంగా వివిధ ప్రాంతాల్లో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని పండితులు నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు పోసి దేవదేవుని కల్యాణోత్సవాన్ని పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. వన్‌టౌన్ కోమలవిలాస్ సెంటర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కమిటీ ప్రముఖులు స్వామి వారికి ముత్యాలతలంబ్రాలను సమర్పించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత రమణీయంగా జరిగింది. స్వామి వారి మూలవరులకు పూలంగిసేవ నిర్వహించారు. స్వర్ణకవచాంకారంలో స్వామి వారి మూలమూర్తులు రమణీయంగా దర్శనమిచ్చారు. కల్యాణోత్సవం అనంతరం వేలాది మందకి అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే సాయంత్రం స్వామి వారికి గరుడసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు, మురళీకృష్ణ తదితరులు పూజలు చేశారు.

భావనారాయణవీధిలో వేంచేసి ఉన్న కోదండరామ స్వామి వారి దేవస్థానంలో నవమి వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లికార్జునపేట రావిచెట్టు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీరామాలయంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం కన్వీనర్ విశ్వనాథ రవి తదితరులు పాల్గొన్నారు.

పంజా సెంటర్ సమీపంలోని మహేశ్వరి ఆంజనేయస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం ఘనంగా చేశారు. కొత్తపేట గణపతిరావురోడ్డులో వేంచేసి ఉన్న శ్రీపాండురంగస్వామి దేవస్థానంలో శ్రీరాముని కల్యాణం కనులపండువగా చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ పర్యవేక్షించారు. పాతబస్తీలోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కెట్ ప్రాంగణంలో ఉన్న రామాలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ దంపతులు పీటలపై కూర్చొని స్వామి కల్యాణోత్సవం జరిపించారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

వించిపేట(విజయవాడపశ్చిమ): చిట్టినగర్, టైలర్‌పేట, రామాలయంవీధిలో సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ న్యాయవాది కొపెల మోహన్ ఈ వేడుకల్లో పాల్గొని సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాలయ దేవస్థాన నిర్వాహకులు కొమరబత్తిన వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, దాసరి ఏసు, కోటమ్మ, గొబ్బి చంద్రరావు, రెంటాల జోషఫ్, నాగరాజు, బొప్పన జాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకల్చరల్: శ్రీ రామనవమి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 80 సంవత్సరాలుగా అవిచ్ఛంగా సాగుతున్న సీతారామ కల్యాణాన్ని శివరామ కృష్ణ క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ నిర్వహణలో రుత్వికులు కల్యాణోత్సవాన్ని జరిపారు. ఆయన మాట్లాడుతూ.. 73 రోజులుగా దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వేడుకలు గురువారంతో ముగుస్తాయని తెలిపారు.

లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో..

కంచికామకోటి పీఠపాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ రామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో శ్రీ రామనవమి వేడుకలు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గం భవానిపురం 40 డివిజన్ పరిధిలోని బ్యాంక్ సెంటర్ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణోత్సవం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):ఏలూరు లాకుల వద్దగల దాసాంజనేయ, సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వార్ల కల్యాణం అంగరంగా వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ట్రస్ట్ కన్వీనర్, ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా పాల్గొని ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా సీతారాముల కల్యాణం అంగ రంగా వైభవంగా నిర్వహిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కొత్తగుళ్లలో కోదండరాముని రాముని కల్యాణ వైభోగం



కొత్తగుళ్ళు కోదండరాముని ప్రత్యేక అలంకారం



ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా



భావనారాయణవీధిలోని కోదండరామాలయంలో స్వామి



రామకోటిలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



సీతారాముల వారిని దర్శించుకున్న భక్తులు



గరుడ వాహన సేవలో కోదండరాముడు

జగనన్న హయాంలో జనరంజక పాలన

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



సీతారామ కల్యాణంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆసిఫ్, భాగ్యలక్ష్మి తదితరులు



శ్రీరామనవమి వేడుకల్లో స్వామి వారి కల్యాణోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ):ధర్మవర్తన, సదా సత్యాన్నే పలుకుతూ ప్రజారంజకమైన పాలనను అందించిన శ్రీరామచంద్రుడు దేవుడై అందరి గుండెల్లో కొలువు తీరాడని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. తాను నమ్మిన సత్యం, ధర్మ మార్గాలను అనుసరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ జనరంజకమైన పాలన అందిస్తున్న సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. శ్రీరామనవమి సందర్భంగా విద్యాధరపురం బైపాస్ రోడ్‌లోని పార్టీ పశ్చిమ కార్యాలయంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, దుర్గారావు దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆసిఫ్ కుమార్తె షేక్ రేష్మా, అల్లుడు అఫ్సర్‌లు పీటల మీద కూర్చుని కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఈ కల్యాణ వేడుకలకు ముఖ్యఅతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరయి శ్రీరాముని రాజ్యంలో మాదిరిగా సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కల్యాణం అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ శ్రీరాముడు మనకు విలువలు, వ్యక్తిత్వాన్ని నేర్పితే, రామాయణం జీవిత పాఠాలను బోధిస్తుందని తెలిపారు. హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామ తత్వం అయితే కష్టంలో కలిసి నడవాలన్నది సీత తత్వమని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలు పంచుకోవాలనేది లక్ష్మణ తత్వమని పేర్కొన్నారు. నమ్మినవారి కోసం దేనికైనా సిద్ధం అనేది ఆంజనేయ తత్వమని వివరించారు. జగత్తుకే ఆదర్శప్రాయుడైన శ్రీరాముడు మానవుడిగా తన విద్యుక్తధర్మాలను ఎలా నిర్వర్తించాలో మానవ జాతికి తెలియ చెప్పిన మహనీయుడు, పూజ్యనీయుడని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గుబ్బా చంద్రశేఖర్, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ టైలర్ పేట ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వైశ్య కాలనీ, మోతీ మసీదు, పెట్రోల్ బంక్ ఎదురుగా, జోడు బొమ్మల సెంటర్, లంబాడీ పేట, పాల ఫ్యాక్టరీ ఏరియా, సయ్యద్ అప్పలస్వామి కాలేజి వెనుక ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీరాముడు ధర్మ స్వరూపుడు

పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



శ్రీరామ నవమి వేడుకల్లో షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీరాముడు ధర్మ స్వరూపుడని, సత్యనిష్ఠకు ధర్మనిరతికి ప్రతీక అని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 40వ డివిజన్ ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ జయం.. సకల ప్రజల విజయమని పేర్కొన్నారు. అందుకే అన్ని కాలాల్లోనూ రామరాజ్యం ఆదర్శమని తెలిపారు. ధర్మం పక్షాన నిలబడి, ప్రజలను మరింత బల సంపన్నులను చేయాలని శ్రీ రామచంద్ర ప్రభువును వేడుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆసిఫ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కేసరి సుబ్బారెడ్డి తనుబుద్ధి శేఖర్ రెడ్డి, చెరుకుపల్లి సుబ్బారెడ్డి, దేవిరెడ్డి వెంకటరెడ్డి, దేవస్థానం కమిటీ తిరుపతి రెడ్డి, వినుకొండ మాలకొండయ్య, జేవీఆర్, కేసరి రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్ వినియోగంలో అప్రమత్తత అవసరం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసే సమయంలో, వాహన చోదకులకు పెట్రోల్ పోసే క్రమంలో కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చునని కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కబేళా సమీపంలోని సుమన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, మారుతీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద వినియోగదారులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కంపెనీ సిబ్బందికి వివరించారు. వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పెట్రోల్‌తో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని చెప్పారు. పెట్రోల్ బంకుల్లో సెల్‌ఫోన్లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గోడౌన్లు, పెట్రోల్ బంకులలో అగ్నిమాపక పరికరాలను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పి ఆహ్వానించిన ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 54, 55 డివిజన్లకు చెందిన పలువురు యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గొల్లపూడి బైపాస్ రోడ్ పక్కన ఉన్న వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయానికి బుధవారం రాత్రి వచ్చిన సుమారు వంద మందికిపైగా యువకులకు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితోపాటు యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయటం పట్ల తామంతా ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. ముఖ్యంగా గ్రామ/వార్డ్ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా దాదాపు నాలుగు లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన జగనన్న బాటలో పయనిస్తామని పేర్కొన్నారు. ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగన్ కృషి, పట్టుదల వలన రాష్ట్రానికి అనేక పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. అలాగే పోర్టుల నిర్మాణం ద్వారా కూడా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 54వ డివిజన్ కార్పొరేటర్ అకీబ్ హర్షద్ పాల్గొన్నారు.

నెమలిలో వైభవంగా విగ్రహ ఆవిర్భావ దినోత్సవం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా జరిపారు. 1952లో శ్రీరామ నవమి రోజు స్వామి భూమి నుంచి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇచ్చారు. దీంతో ప్రతి ఏటా ఆరో విగ్రహ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తారు. తెల్లవారు ఝామున సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే ప్రారంభించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరణ చేయగా భక్తులు స్వామిని దర్శించుకొని తరించారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీదేవి సామూహిక కుంకుమార్చన చేశారు. సంప్రదాయబద్ధంగా తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను తయారుచేసి స్వామికి నివేదన సమర్పించారు.